నగరంలో దసరా ఉత్సవాల సందడి


ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన పందిరి


అమ్మవారిశాల వద్ద ఏర్పాటు చేస్తున్న పందిరి


ఆలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేస్తున్న సెట్టింగ్

- అమ్మవారిశాల వద్ద భారీ పందిరి నిర్మాణం
- మిగతా ఆలయాల వద్ద కూడా కొనసాగుతున్న ఏర్పాట్లు

కడప సెవెన్‌రోడ్స్ : మరో ఐదు రోజుల్లో దసరా శరన్నవ రాత్రులు ప్రారంభం కానున్నాయి. దీని కోసం అమ్మవారి ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా అలంకరించేందుకు తగిన ఏర్పాట్లులో ఆయా ఆలయాల కమిటీలు నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి (అమ్మవారిశాల) ఆలయాన్ని ఆర్యవైశ్యులు అత్యంత వైభవంగా అలంకరిస్తారు. ఈ పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆలయం వద్ద ఈ సంవత్సరం సరికొత్త సెట్టింగులతో వినూత్నంగా తీర్చిదిద్దుతున్నారు. అలాగే ప్రతి ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలోని దాదాపు అన్ని ఆలయాల వద్ద దసరా కోసం ఆలయాల వెలుపల సెట్టింగుల నిర్మాణం ప్రారంభమైంది. కడప అమ్మవారిశాలలో పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రత్యేకంగా ఇతర ప్రాంతాల నుంచి సెట్టింగులు వేసే కార్మికులను పిలిపించారు. ఇందులో రాజ భవనాలను తలపించే సెట్టింగులను సిద్ధం చేస్తున్నారు. అధునాతన నిర్మాణ సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ముందుకంటే కేవలం సగం సమయంలోనే భారీ సెట్టింగులను సిద్ధం చేసేందుకు అవకాశం లభించింది. దసరా శరన్నవరాత్రులకు గడువు సమీపిస్తుండడంతో నిర్వాహకులు, కార్మికులు శ్రమిస్తున్నారు.

ఇతర ఆలయాల్లో..

నగరంలో ప్రముఖంగా విలసిల్లుతున్న శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో అలంకారం కోసం పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబదేవి ఆలయం, శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయ సముదాయంలో పండుగ నిర్వహణకు భారీ పందిళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఆ పక్కనేగల భావనారుషి ఆలయం, బాల పోలేరమ్మ ఆలయాలకు కూడా దసరా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నగరంలోని నాగరాజుపేట, నబీకోట, బళ్లారిరోడ్డులోని అమ్మవారి ఆలయాలతో పాటు నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయనత ఆలయాలలో కూడా పండుగ నిర్వహణకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్ పోస్ట్) పోస్ట్ భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి తెలిపారు. భౌతిక శాస్త్రం సబ్జెక్టుకు సంబంధించి పీజీ 50 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. భౌతిక శాస్త్రం సబ్జెక్టు బోధనకు ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల ప్రిన్సిపల్‌ను తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌తోపాటు ఒక సెట్ జిరాక్స్ సర్టిఫికెట్ తీసుకొని 17వ తేదీ బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు కళాశాలకు హాజరుకావాలన్నారు. కళాశాలలో మౌలిక డెమో నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారికి జీతం గంటకు 370 రూపాయలు తగ్గకుండా నెలకు 27,000- వేల రూపాయలు మించకుండా ఇస్తామన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. అభ్యర్థుల బోధన నైపుణ్యత, అర్హతలను పరిశీలించారు. ఇంటర్వ్యూలలో సబ్జెక్ట్ నిపుణులు అనంతపురం ఎస్.కె. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.వి..శ్రీనివాసన్, వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డీన్లు ప్రొ పి.రమాదేవి, ప్రొ.వై.సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగ అధిపతి డా.కె.రామ సుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల మధ్యన సెల్ టవర్ వద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఇండ్ల మధ్యలో సెల్ టవర్ ఏర్పాటు చేయడంతో రేడియేషన్ పెరిగి ఎన్నో రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉందని, నివాసాల మధ్యలో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ కోరారు. మంగళవారం ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, టెక్నాలజీ పేరుతో రోగాలను నెత్తిన పెట్టుకొని తిరుగుతున్నామని, కొందరి ఆర్థిక ప్రయోజనాల కోసం సెల్ టవర్ ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. దీని ద్వారా జరిగే లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వెంకటేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్ : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం అని జిల్లా ఈగల్ బృందం పేర్కొన్నారు. కడప చిన్నచౌక్ పరిధిలోని జీఎంఆర్ ఇంగ్లీస్ మీడియం స్కూల్లో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై జిల్లా 'ఈగల్' సెల్ , నార్కోటిక్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. మీ ఇల్లు లేదా పాఠశాల చుట్టుపక్కల డ్రగ్స్, మత్తు పదార్థాల సంబంధించిన సమాచారం తెలిస్తే, వెంటనే 1972 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా 8977781972 వాట్సప్ నెంబర్‌కు సమాచారం తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, చిన్నచౌక్ ఎఎస్ఐ యోదీంద్రనాయల్, నార్కోటిక్ సెల్ ఏఎస్ఐ మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయూబ్ ఖాన్, గురు శేఖర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


మారాశి సురేంద్రనాథ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లా చాపాడు మండలం శ్రీరాముల పేటకు చెందిన అధ్యాపకుడు మారాశి సురేంద్రనాథ్‌రెడ్డికి ఆంధ్ర విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన అనంతపురంలోని రాఘవేంద్ర ఫార్మసి కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈయన ఆంధ్ర విశ్వ విద్యాలయం ఫార్మాస్యూటికల్స్ సైన్సు విభాగం ఆచార్యులు డాక్టర్ క్రిష్ణమంజిరి పవార్ పర్యవేక్షణలో "న్యూ వాలిడేటడ్ స్టెబిలిటి ఇండికేటింగ్ రివర్స్ ఫేస్ అల్ట్రా పప్ పార్మన్స్ లిక్విడ్ క్రోమాటోగ్రఫీ మెథడ్స్ ఫర్ ది ఎస్టిమేషన్ ఆఫ్ సమ్ రీసెంట్ డ్రగ్స్ అండ్ దేర్ డోసేజ్ ఫామ్స్" అంశంపై చేసిన పరిశోధనకు ఆంధ్ర విశ్వ విద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

అన్నదానం


స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం చేస్తున్న డీఈ గోపాలక్రిష్ణ

కడప కార్పొరేషన్ : కడప నగరం ప్రకాష్ నగర్‌లోని స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహంలో కడప అర్బన్ హౌసింగ్ డీఈ గోపాలక్రిష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గోపాలక్రిష్ణ మాట్లాడుతూ ఇంజినీర్స్ డే ను పురస్కరించుకొని అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మను కళాశాలల మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం స్వచ్ఛత పక్షంలో భాగంగా ఎన్ ఎస్ ఎస్ తరుపున విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మిర్జా విలయత్ అలీ బైగ్, కోఆర్డినేటర్స్ ఒమర్ ఫరూక్ మొహమ్మద్, సికందర్ హుస్సేన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సిద్దవటంలో పర్యాటక దినోత్సవం నిర్వహించాలి

కడప సెవెన్‌రోడ్స్ : పర్యాటక పితామహులు సిద్దవటం సీతారామయ్య ఆశయ సాధనకు కృషి చేస్తానని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవాధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు అన్నారు. మంగళవారం కడప నగరం మొల్ల సాహితీపీఠం కార్యాలయంలో జరిగిన తన 79వ జన్మదిన వేడుకల సందర్భంగా బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తొలి జిల్లా కేంద్రమైన సిద్దవటంలో ఈనెల 27న పర్యాటక దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన


పాఠశాల ఆవరణంలో శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-9 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. కె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారంరోజుల ప్రత్యేక శిబిరంలో మంగళవారం ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి, పౌరులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే కొన్ని స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ పథకాలను ఎలా ఉపయోగించాలో, వాటివల్ల కలిగే ప్రయోజనాలు, పరిమితులు వంటి విషయాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కేంద్ర పథకమైన ఆయుష్మాన్ భారత్ ప్రతి పేద కుటుంబానికి రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా, ఉజ్వల యోజన దారిద్ర రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన, పేదలకు ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం, జనధన్ యోజన బ్యాంకింగ్ సేవలను ప్రతి కుటుంబానికి అందుబాటులోకి తీసుకురావడం. స్వచ్ఛ భారత్ మిషన్, శుభ్రత, మరుగుదొడ్లు నిర్మాణానికి మద్దతుపై ప్రజలను చైతన్యం చేశారు. గ్రామంలోని డ్రైనేజ్ వ్యవస్థను శుభ్రపరిచారు. ముళ్లకంపలు, అనవసర మొక్కలను తొలగించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగనవాడీ కేంద్రం పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ శాఖకి చెందిన సి నారాయణ రెడ్డి, సుమారు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

కడప ఎడ్యుకేషన్ : సైబర్ నేరాల పట్ల ఖాతాదారులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ చీఫ్ మేనేజర్ నూతన కుమార్ సూచించారు. మంగళవారం కడపలోని స్పిరిట్స్ డిగ్రీ, పీజీ కాలేజీలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'యోనో ఆప్ - డిజిటల్ పేమెంట్స్' పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నూతన కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారుడు సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని, ఎవ్వరికీ ఏటీఎం పిన్ నంబర్స్ చెప్పవద్దని సూచించారు. కడప ఆర్బీసీ బ్రాంచ్ మేనేజర్ మధు మాట్లాడుతూ విద్యార్థులందరూ సున్నా బ్యాలెన్సు తో సేవింగ్స్ అకౌంట్స్ తమ బ్రాంచ్ లో ప్రారంభించుకోవచ్చని తెలిపారు. డిజిటల్ మేనేజర్ షామీర్, క్రెడిట్ కార్డు మేనేజర్ నాగార్జున మాట్లాడారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు అడిగిన సందేహాలను బ్యాంకు అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రవీంద్ర, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర మంత్రి సత్యకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని జీఎంఆర్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీ గురూజీ వానప్రస్తాశమంలోగల అనాథ వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు నిత్య, రాజారావు, కొండయ్య, నరసింహ, గంగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలియజేస్తుండగా భక్తులు ఆచరించారు. మంగళవారం కావడంతో అమ్మవారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించి విశేష అలంకారం అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కాగా ఈ నెల 22 వ తేదీ నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు శ్రీ విజయ దుర్గా దేవి శరన్నవరాత్రి (దసరా) ఉత్సవాలు కన్నుల పండుగగా జరగనున్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హమాలీల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సివిల్ సప్లయి హమాలీల సమస్యలను పరిష్కరించాలని, ప్రతినెలా మొదటి వారంలోనే కూలి చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డ్ లోని సివిల్ సప్లయి గోడౌన్‌లో హమాలీల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం నుంచి నేటికీ గుర్తింపు లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదని ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. రిటైరైన హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాలో ఏంఎల్ఎస్ పాయింట్లకు సొంత గోదాంలు నిర్మించి కార్మికులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర కార్యదర్శి ఉద్దే మద్దిలేటి, సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాల గురువయ్య, మురారి, ఉపాధ్యక్షులు శ్రీరాములు, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలి


అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ శేఖర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్న ఉద్దేశంతో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాశాల పనులను నిలిపివేసి పీపీపీ (పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్షిప్) పద్ధతిలో కొనసాగించడానికి క్యాబినెట్ తీర్మానం చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాలా సుమంత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అఖిలేష్, నాయకులు నవీన్, రాజు, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఎస్. రవి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్‌లలో కార్మికులుగా పని చేస్తూ మృతి చెందిన, ఉద్యోగ విమరణ పొందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి డిమాండ్ చేశారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపాదిస్తున్న కుటుంబ పెద్ద, తల్లి, తండ్రి మృతి చెందడంతో ఆయా కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడి జీవనం సాగిస్తున్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు మృతి చెందితే వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని ప్రయోజనాలు కల్పిస్తుందని, కారుణ్య నియామకాలు కూడా చేపడుతారన్నారు. కానీ ఆప్కాస్ కార్మికులు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా వేతనాల్లో భారీ వ్యత్యాసముందన్నారు. పైగా వారికి ఇఎస్ఐ, పిఎఫ్ కూడా వర్తించడం లేదన్నారు. ఇప్పటికే అనేక మంది కార్మికులు ఉద్యోగ విరమణ పొందంతో మిగతా వారిపై పనిభారం ఎక్కువైందన్నారు. మూడేళ్లుగా 9 మంది కార్మికులు మరణించారని, వారి వారసులకు ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. రిటైర్డ్ అయిన 41 మంది కార్మిక కుటుంబాల్లో 27 మందిని అదనపు కార్మికులుగా తీసుకున్నారు. వీరికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మిగిలిన 14 మంది కూడా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఉద్యోగాలు ఇవ్వాలని నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తెలిపినా, ఇంతవరకు వారికి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. వినతి పత్రాలు సంప్రదింపులతో విసిగిపోయిన తాము పాదయాత్ర నిర్వహించాలని తీర్మానించామన్నారు. కార్మికులందరూ ఇందులో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా లో ప్రస్తుతం జ్వరాలు ఎక్కువ అవుతున్న తరుణంలో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇదే అదునుగా చూసుకొని ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా లో ప్రస్తుతం విష జ్వరాలు ఎక్కువ గా వస్తున్నాయని అన్నారు. అయితే ఇటువంటి పరిస్థితిని జిల్లా లోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రకరకాల టెస్టుల పేరుతో పరీక్షలు నిర్వహించి చికిత్స కోసం ప్రజల నుండి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఇదే అదునుగా చూసుకున్న డయాగ్నొస్టిక్ సెంటర్లు కూడా అధిక ఫీజులు టెస్టులకు వసూలు చేస్తున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటువంటి వాటి పై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

పరామర్శ


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


తోటక్రిష్ణను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నేత తోటక్రిష్ణను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం ఆయన కో ఆపరేటివ్ కాలనీలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, కిరణ్, షేక్ షఫీ, కార్పొరేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

సాక్షి టీవీ కరస్పాండెంట్‌కు..

రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న సాక్షి టీవీ కరస్పాండెంట్ వి.శ్రీనివాస్‌ను మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పరామర్శించారు. సోమవారం రాత్రి ఆయన స్వగృహానికి వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, నగర కార్యదర్శి అహ్మద్ పాల్గొన్నారు.

21న నెలనెలా సీమ సాహిత్యం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా 147వ సదస్సును ఈనెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. ఈ సదస్సులో 'ఎం.వి.లోకనాథం జీవితం - సాహిత్యం' అనే అంశంపై యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ప్రసంగిస్తారన్నారు.

ప్రకృతి ఇచ్చిన గొప్పవరం ఓజోన్ పొర


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్ : ప్రకృతి మన కిచ్చిన గొప్పవరం ఓజోన్ పొర అని, దానిని మనం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో సెప్టెంబర్ 16న ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓజోన్ పొర రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన శాస్త్ర అధ్యాపకులు రాజేశ్వరి, రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

- కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ ఎస్ ఎస్, జంతుశాస్త్ర విభాగం, ఇండియన్ రెడ్ క్రాస్ క్లైమేట్ ఆప్షన్ క్యాంపెయిన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఈ సంవత్సరం థీమ్ అయిన 'ఫ్రం సైన్స్ టు గ్లోబల్ యాక్షన్' అనే అంశంపై చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి సలీం బాష విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఓజోన్ దే ప్రాముఖ్యతపై అవగాహన

కడప సెవెన్‌రోడ్స్ : ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినం సందర్భంగా మంగళవారం జన విజ్ఞాన వేదిక నాయకులు స్థానిక విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు పల్లా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎయిర్‌పోర్టులో యాత్రి సేవా దివస్


మాట్లాడుతున్న కడప ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పొడర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇప్పటికే ప్రయాణీకులకు విశేష సేవలు అందిస్తున్న కడప ఎయిర్‌పోర్టులో బుధవారం యాత్రి సేవా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కడప ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సుజిత్‌కుమార్ పొడర్ తెలిపారు.

మంగళవారం కడప నగర శివార్లలోని ఎయిర్‌పోర్టులోగల తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాన్ ఇండియా కార్యక్రమంగా దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ కార్యక్రమం కడప ఎయిర్‌పోర్టులో కూడా నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. విమాన ప్రయాణం సుఖమయంగా, సౌకర్యవంతంగా కొనసాగేలా తమ చర్యలు ఇప్పటికే కొనసాగుతున్నాయని ఆయన వివరించారు. యాత్రి సేవా దివస్ కార్యక్రమంలో భాగంగా కడప ఎయిర్‌పోర్టులో కల్చరల్ ఈవెంట్స్, రక్తదాన శిబిరం, వైద్య శిబిరం, కంటి శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం, పిల్లలకు డ్రాయింగ్ కాంపిటీషన్, కెరీర్‌గైడెన్స్, ప్రయాణీకుల ఫీడ్‌బ్యాక్ తదితర కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎయిర్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు 12వ పీఆర్సీతోపాటు, కరువు భత్యం, మధ్యంతర భృతి ని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా మంగళవారం కడప కలెక్టరేట్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర గడచినా సమస్యల పరిష్కారానికి కృషిచేయలేదన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బోధనకు ఆటంకం కలిగించే అనవసరమైన యాప్‌లను రద్దుచేసి, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, మూల్యాంకన పుస్తక విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఖాదర్ బాషా, జిల్లాకార్యదర్శులు సుబ్బారెడ్డి, చిన్న గురయ్య, నరసింహులు, పూర్వ అధ్యక్షుడు గురయ్య, జిల్లా కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.